సాక్షి
మహబూబాబాద్
మంగళవారం | 20 | మే | 2025



పుష్కర విధుల్లో అతివలు
కాళేశ్వరంలోని సరస్వతీనది పుష్కరాల్లో పురుమలకు దీటుగా మహిళా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు.
- 8లో ▸



కమిషనరేట్‌లో ఏసీపీల బదిలీ
రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏసీపీల బదిలీల్లో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పలువులు ఏసీపీలకు స్థానచలనం కలిగింది.
- 8లో ▸

గరిష్టం/కనిష్టం
39.3° /25.8°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పోస్టర్ల ఆవిష్కరణ



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను అదనపు కలెక్టర్ వీర బ్రహ్మచారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మైనార్టీ గురుకులాల్లో 5వ తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో నేటి నుంచి ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు జిల్లా స్థాయి నైపుణ్య శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు డీఈఓ రవీందర్‌రెడ్డి సోమవారం తెలిపారు. మొదటి విడత శిక్షణ తరగతులు విజయవంతంగా పూర్తయ్యాయని, జిల్లా కేంద్రం, పలు మండల కేంద్రాల్లోని పాఠశాలల్లో ఈనెల 20 నుంచి 24వ తేదీ వరకు రెండో విడత శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, సెకండరీగ్రేడ్ ఉపాధ్యాయులకు శిక్షణ ఉంటుందన్నారు. తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్ ద్వారా ఉపాధ్యాయుల హాజరు ఇన్‌టైం, అవుట్ టైం మార్క్ చేయడం, ప్రీటెస్ట్, పోస్ట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. టెస్ట్‌లో ఉత్తములకు సర్టిఫికెట్లను అందజేస్తారన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు



మహబూబాబాద్ రూరల్: యువత మత్తుపదార్థాలకు బానిస కావొద్దని జిల్లా ఎక్సైజ్ అధికారి బి.కిరణ్ అన్నారు. ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, గుట్కా వ్యతిరేక కార్యక్రమ పోస్టర్లను డీపీఈఓ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా మాదకద్రవ్యాల నిరోధంపై ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ చేపట్టనున్న కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. యువత మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటుందని, ఇది ఒక సామాజిక సమస్యగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలు,మత్తుపదార్థాల వ్యతిరేక సదస్సుల నిర్వహణలో ప్రభుత్వ సహకారం తప్పనిసరిగా ఉంటుందని, జిల్లాను డ్రగ్స్, గుట్కారహితంగా మార్చడానికి ప్రతీ ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సైకాలజిస్టుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ డేవిడ్, డీపీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్ హోలియా, సీనియర్ అసిస్టెంట్ శ్యామ్ కుమార్, జూనియర్ అసిస్టెంట్ కనక రాజు, కానిస్టేబుల్ జ్యోతి, భారతి చారిటబుల్ ట్రస్ట్ అధినేత ఆడెపు రాజేంద్రప్రసాద్, ఆరోగ్య మిత్ర స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సహజ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలి



మహబూబాబాద్ రూరల్: జిల్లాలోని వ్యవసాయ అధికారులు నకిలీ విత్తనాలను అరికట్టాలని, గ్రామాల్లో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించాలని డీఏఓ ఎం.విజయనిర్మల అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని రైతు వేదికలో జిల్లాలోని వ్యవసాయ అధికారులతో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఏఓ మాట్లాడుతూ.. జిల్లాలో వానాకాలం సీజన్‌కు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేవిధంగా చూసుకోవాలని ఆదేశించారు. పచ్చిరొట్ట విత్తనాల పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలన్నారు. సమావేశంలో ఏడీఏలు అజ్మీరా శ్రీనివాసరావు, వి.విజయ చంద్ర, జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ టెక్నికల్ ఏడీఏ బి.మురళి, ఏఓ జావెద్, జిల్లాలోని అన్ని మండలాల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

నదిలో దీపం వదులుతున్న కుటుంబం



పుణ్య స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న కేంద్ర మంత్రి బండి సంజయ్ దంపతులు



త్రివేణి సంగమం.. భక్తజన సంద్రం

కాళేశ్వరంలో భక్తుల సందడి
- పుణ్యస్నానాలు ఆచరించిన వేలాది భక్తులు
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రముఖులు

త్రివేణి సంగమం.. భక్త జన సంద్రమైంది. పుష్కరిణి స్నానం.. పులకించేలా చేసింది. వడివడిగా పరుగులు పెడుతున్న చల్లని తల్లికి వాయినాలిచ్చే ఆడపడుచులు.. పితృదేవతలను స్మరిస్తూ తర్పణాలు వదిలే పురుషులు. కేరింతలు కొడుతూ అల్లరి చేస్తున్న యువతులు, చిన్నారులతో నదీ ప్రాంతం సందడిగా మారింది. ఐదో రోజు సోమవారం వేలాదిగా భక్తులు కాళేశ్వరానికి తరలివచ్చారు. ముక్తీశ్వరుడిని దర్శించుకునేందుకు గంటల కొద్దీ క్యూలో వేచి చూశారు.

- వివరాలు, మరిన్ని ఫొటోలు 8లో ▸

సౌకర్యాలు నిల్!

పని ప్రదేశాల్లో టెంటు, తాగునీరు, ప్రథమచికిత్స కిట్లు కరువు
- ఇబ్బందులు పడుతున్న ఉపాధి హామీ కూలీలు
- సౌకర్యాలు కల్పించాలని వేడుకోలు



మండుటెండలో పనులు చేస్తున్న ఉపాధి కూలీలు

మహబూబాబాద్ అర్బన్: గ్రామాల్లో ఉపాధి హామీ కూలీలకు సౌకర్యాల కల్పనపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. పని ప్రదేశాల్లో టెంట్, తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలి. కానీ ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడంతో కూలీలు మండుటెండలో పనులు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

లేని సౌకర్యాలు..
ఉపాధి హామీ పని ప్రదేశాల్లో సౌకర్యాలు కానరావడం లేదు. ప్రతీ కూలీకి 5లీటర్ల తాగునీరు ఇవ్వాలి. ప్రథమచికిత్స కోసం బ్యాండేజ్, అయోడిన్, పెయిన్ కిల్లర్ మందులు అందుబాటులో ఉంచాలి. నీడ కోసం టెంట్ వేయాలి. కూలీల సమస్యలు తెలిపేందుకు ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 18002001001 అందుబాటులో ఉంచాలి. కాగా ఇవేమి పని ప్రదేశాల్లో ఉండడం లేదు. ఏమైనా జరిగితే ఎవరూ బాధ్యత వహిస్తారని కూలీలు వాపోతున్నారు. కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు. అలాగే ఫీల్డ్ అసిస్టెంట్లు, కూలీలు, టీఏలు, ఈసీలు, ఏపీఓలకు వేసవి భత్యం అందడం లేదు. 2014నుంచి అమలు కావడం లేదు.

జిల్లా ఉపాధి హామీ కూలీల వివరాలు..

మండలం	యాక్టివ్ జాబ్‌కార్డులు	పనిచేసే ఉపాధి కూలీలు
బయ్యారం	8,008	1,3332
చిన్నగూడూరు	7,544	1,4273
డోర్నకల్	1,0454	1,8335
దంతాలపల్లి	6,189	1,1130
గంగారం	2,824	5,272
గూడూరు	1,3807	2,4800
గార్ల	7,379	1,3392
కురవి	1,3370	2,4346
కొత్తగూడ	6,598	1,2202
కేసముద్రం	1,3835	2,5564
మహబూబాబాద్	9,782	1,7514
మరిపెడ	1,2544	2,3352
నెల్లికుదురు	1,3231	2,5604
నర్సింహులపేట	7,544	1,4273
తొర్రూరు	7,575	1,2489
పెద్దవంగర	4,773	8,765
మొత్తం	1,45,457	2,64,643

ఈ ఏడాది అయినా వేసవి భత్యంతో పాటు సౌకర్యాలు కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

వసతులు లేవు..



పని ప్రదేశాల్లో వసతులు కల్పించడం లేదు. తాగడానికి మంచినీరు.. నీడ కోసం టెంట్ లేదు. ప్రతీ సంవత్సరం ఉపాధిహామీ కూలీలకు రూ.5 నుంచి రూ.20 పెంచుతారు. ఈసారి రూ.7మాత్రమే పెంచడం సరికాదు. సార్లను అడిగితే ఇది కేంద్ర ప్రభుత్వం నిర్ణయం అని అంటున్నారు.

- ఉబ్బపల్లి పీరయ్య, కూలీ, మానుకోట

సౌకర్యాలు కల్పిస్తాం..



జిల్లాలో కూలీలు పనిచేసే ప్రదేశాల్లో అన్ని వసతులు అందిచాడానికి కృషి చేస్తున్నాం. ఇప్పటికే ఉపాధి హామీ పని ప్రదేశాల్లో వసతులు కల్పించాలని ఆదేశాలు జారీ చేశాం. గ్రామపంచాయతీ ద్వారా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇంకా అవసరం ఉన్నచోట ఏర్పాటు చేస్తాం.

- మధుసూదన్‌రాజు, డీఆర్డీఓ

పార్టీలో కోవర్టులకు స్థానంలేదు

- నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలకే స్థానిక ఎన్నికల్లో ప్రాధాన్యం
- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

తొర్రూరు రూరల్: కాంగ్రెస్ పార్టీలో కోవర్టులకు స్థానం లేదని, నిజమైన కార్యకర్తలకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యం ఉంటుందని ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నాంచారీమడూరు గ్రామ శివారులోని రెడ్డి గార్డెన్‌లో తొర్రూరు మండల, పట్టణ స్థాయి కార్యకర్తల సమావేశాన్ని పార్టీ జిల్లా పరిశీలకురాలు రవళిరెడ్డి, పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన కార్యకర్తలకే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రాధాన్యత ఇస్తామన్నారు. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో పాత, కొత్త తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా పనిచేసి అన్ని స్థానాలు గెలవడానికి కృషి చేయాలన్నారు. అనంతరం పరిశీలకురాలు రవళిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు జరిగే పార్టీ సంస్థాగత ఎన్నికల్లో అందరూ పోటీ చేయాలని, పార్టీ కోసం నిజాయితీగా పని చేసే నాయకులు, కార్యకర్తలకు మాత్రమే కులాల వారీగా అవకాశాలు కల్పిస్తుందన్నారు. పార్టీ పదవుల నియామకాల్లో ఎలాంటి పైరవీలు, ఒత్తిడి ఉండదని, పార్టీ కోసం నిరంతరం పని చేసే వారికే అవకాశం దక్కుతుందన్నారు. పార్టీ బ్లాక్, మండల, పట్టణ అధ్యక్షులు హమ్యానాయక్, సుంచు సంతోష్, సోమరాజశేఖర్, మండల, గ్రామాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం అడ్మిషన్లు పూర్తి చేయాలి



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఆర్సీఓ రమేశ్‌లాల్

మహబూబాబాద్ అర్బన్: మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో వందశాతం అడ్మిషన్లు పూర్తి చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్సీఓ రమేశ్ లాల్ హట్కర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయులు చేపట్టిన అడ్మిషన్ల ప్రక్రియను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మైనార్టీ గురుకులాల్లో 5 నుంచి 8వ తరగతి వరకు ముస్లిం విద్యార్థుల అడ్మిషన్లు పూర్తి చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఇంటింటా ప్రచారం చేయాలని, విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మైనార్టీ గురుకులాల్లో నాణ్యమైన విద్యతో పాటు అన్ని వసతులు ఉచితంగా అందిస్తారని అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మహేశ్, రాజశేఖర్, ఇమాముద్దీన్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే అనుమతులు రద్దు

- డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్



స్కానింగ్, ఎక్స్‌రే పరికరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్, అధికారులు

నెహ్రూసెంటర్: ప్రైవేటు ఆస్పత్రులు నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులు జారీతో పాటు అనుమతులను రద్దు చేస్తామని డీఎంహెచ్‌ఓ రవిరాథోడ్ హెచ్చరించారు. వైద్యారోగ్యశాఖ అధికారులు సోమవారం జిల్లా కేంద్రంలోని పలు ఆస్పత్రుల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. వైద్యారోగ్యశాఖ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఆస్పత్రి భవనాల్లో ఫైర్‌సేఫ్టీ అనుమతులు తీసుకోవాలని, బయో మెడికల్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి సర్టిఫికెట్లు విధిగా తీసుకోవాలని సూచించారు. స్కానింగ్ సెంటర్‌లో అనుమతి పొందిన రేడియోలాజిస్టులు, గైనకాలజిస్టులు మాత్రమే గర్భిణులకు స్కానింగ్‌లు చేయాలని, లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఆస్పత్రుల యాజమాన్యాలు అందించే వైద్య సేవలకు సంబంధించిన రుసుము వివరాలను ఆస్పత్రి ఆవరణలో ఏర్పాటు చేయాలని చెప్పారు. తనిఖీల్లో ప్రోగ్రాం అధికారి సారంగం, డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్, హెచ్ఈఓ లోక్య, ఎల్‌డీ కంప్యూటర్ అరుణ్, మనోహర్, సీసీ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్
- ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



కొనుగోలు కేంద్రంలో రిజిస్టర్ తనిఖీ చేస్తున్న కలెక్టర్

మహబూబాబాద్ రూరల్: రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అన్నారు. మహబూబాబాద్ మండలంలోని కంబాలపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజిస్టర్లను పరిశీలించారు. కొనుగోలు చేసిన ధాన్యం, రైస్ మిల్లులకు తరలింపు, మద్దతు ధర చెల్లించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేంద్రానికి వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి వెంటనే మిల్లులకు తరలించాలని ఆదేశించారు. లారీలు, గోనె సంచుల సమాచారంపై రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరంలేదని, అధికారులు ధాన్యాన్ని మిల్లులకు సకాలంలో తరలించి రైతులకు ఎటువంటి సమస్యలు లేకుండా క్షేత్రస్థాయిలో పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. వాతావరణ మార్పుల దృష్ట్యా అకాల వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని సూచించారు.

ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించాలి
చిన్నగూడూరు: ధాన్యాన్ని సకాలంలో మిల్లులకు తరలించాలని కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశించారు. సోమవారం మండలంలోని చిన్నగూడూరు, విస్సంపల్లి, ఉగ్గంపల్లి కొనుగోలు కేంద్రాలను సందర్శించి ధాన్యం కొనుగోలు రిజిస్టర్లను పరిశీలించారు. ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిల్లో తనిఖీలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహబూబ్ అలీ, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు, రైతులు ఉన్నారు.

తూకాల్లో మిల్లర్ల మోసం.. రైతుల ఆందోళన



శ్రీశ్రీ పారాబాయిల్డ్ రైస్ మిల్లు ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

నర్సింహులపేట: మిల్లర్లు ధాన్యం తూకాల్లో మోసం చేయడంతో రైతులు ఆందోళన చేసిన ఘటన మండలంలో సోమవారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని గోపతండా సమీపంలోని వెంకటేశ్వర బాయిల్డ్ రైస్ మిల్లు నిర్వాహకులు పెద్దనాగారం శ్రీశ్రీబాయిల్డ్ రైస్ మిల్లు వద్ద ఉన్న వేబ్రిడ్జిపై తూకం వేసి కొనుగోలు చేస్తున్నారు. కాగా, ఐకేపీ కొనుగోలు కేంద్రంలో వేసిన తూకానికి సుమారు క్వింటాకు 3కిలోల చొప్పున పెద్దనాగారం శ్రీశ్రీ పారాబాయిల్డ్ రైస్ మిల్లులోని వేబ్రిడ్జిలో తక్కువ రావడం గమనించిన రైతులు దంతాలపల్లిలోని వేబ్రిడ్జిలో తూకం వేశారు. అక్కడ ఐకేపీలో వేసిన తూకానికి సమానంగా వచ్చింది. దీంతో శ్రీశ్రీ పారాబాయిల్డ్ రైస్ మిల్లు వద్ద దంతాలపల్లి, నర్సింహులపేట, చిన్నగూడూరు, మరిపెడకు చెందిన రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. రెండు మిల్లుల యజమానులు ఒకటై తమను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈక్రమంలో వందలాది ట్రాక్టర్లు, లారీలు మిల్లు వద్ద నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న తూనికలు, కొలతల జిల్లా అధికారి విజయ్‌కుమార్ సంఘటన స్థలానికి వచ్చి మిల్లుల యజమానులు, రైతులతో మాట్లాడారు. న్యాయం జరిగేలా చూస్తామని చెప్పడంతో రైతులు శాంతించారు.

రైతులకు అండగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న అధికారి ప్రేమ్‌కుమార్, పక్కన అధికారులు

మరిపెడ: ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రేమ్‌కుమార్ అన్నారు. మరిపెడ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సివిల్ సప్లయీస్ డీఎం కృష్ణవేణితో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల ధాన్యం కొనుగోళ్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. మరిపెడలో గత యాసంగి సీజన్ కంటే ప్రస్తుతం అధికంగా ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటివరకు 75శాతం ధాన్యం సేకరణ పూర్తయినట్లు తెలిపారు. కలెక్టర్ నిత్యం అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రత్యేకాధికారులు కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. సమావేశంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్‌కుమార్, డీపీఆర్‌ఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న డీఐఈఓ మదార్‌గౌడ్

మహబూబాబాద్ అర్బన్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని డీఐఈఓ మదార్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సీఎస్, డీఓలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 22నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమవుతాయని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఫస్టియర్ పరీక్షలు ఉదయం 9నుంచి 12గంటల వరకు, సెకండియర్ పరీక్షలు మధ్యాహ్నం 2:30నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు జరుగుతాయని తెలిపారు. ప్రతీ పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా తాగునీటి వసతి, మరుగుదొడ్లు, కరెంట్ తదితర ఏర్పాట్లు చేయాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు సమన్వయంతో పని చేసి పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ నుంచి ప్రశ్నపత్రాలను పోలీసు బందోబస్తు మధ్య కేంద్రాలకు తీసుకెళ్లాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో సెల్ ఫోన్, ఇతర సాంకేతిక గాడ్జెట్స్‌ను ఎవరు తీసుకురాకుండా చూసే బాధ్యత సీఎస్, డీఓలదే అన్నారు. విద్యార్థులు హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చన్నారు. జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు రాజకుమారి, కుమార్, చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి సెమినార్ నివేదిక అందజేత



బాలకృష్టారెడ్డికి నివేదిక అందజేస్తున్న వెంకట్, అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ ఏడాది మార్చిలో 'దేశంలో సంకీర్ణ ప్రభుత్వాలు – ప్రాధాన్యత' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించారు. సెమినార్‌కు వచ్చిన పరిశోధన పత్రాలను నివేదికగా రూపొందించారు. ఈ మేరకు ఆ నివేదిక పుస్తకాన్ని హైదరాబాద్‌లో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్టారెడ్డి, ఐసీఎస్ఎస్ఆర్ ఎస్ఆర్సీ కార్యాలయంలో డైరెక్టర్ ప్రొఫెసర్ సుధాకర్‌కు పొలిటికల్ సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ సంకినేని వెంకట్, అధ్యాపకులు సోమవారం అందజేశారు. కార్యక్రమంలో బీఓఎస్ చైర్మన్ డాక్టర్ గడ్డం కృష్ణ, అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వాడపెల్లి నాగరాజు, స్కాలర్ అంకెళ్ల శంకర్ పాల్గొన్నారు.

భద్రకాళిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి



హన్మకొండ కల్చరల్: భద్రకాళి ఆలయాన్ని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి సుజాన తన కుటుంబ సమేతంగా సోమవారం సందర్శించారు. ఆలయ సహాయ కమిషనర్, ఈఓ శేష భారతి అర్చకులతో కలిసి పూర్ణకుంభంతో స్వాగం పలికారు. కాగా అమ్మవారికి జడ్జి సుజాన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు జడ్జి దంపతులకు మహాదాశీర్వచనం ఇచ్చి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

నదికి మొక్కుతున్న భక్తులు



చిన్నారికి స్నానం చేయిస్తున్న కుటుంబీకులు



భక్తురాలి పూనకం





పుణ్యస్నానానికి వస్తున్న భక్తజనం

పుష్కరం.. పుణ్యఫలం..



ఉదకం వదులుతున్న భక్తులు



స్నానమాచరిస్తున్న ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్ కుటుంబం



హారతి తీసుకుంటున్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్





పుష్కరుడికి నీళ్లు వదులుతున్న మహిళలు



నది తీరంలో భక్తుల కోలాహలం



నదిలో కుటుంబం సంతోషం

కాళేశ్వరంలో ఇద్దరికి గుండెపోటు



అస్వస్థతకు గురైన కానిస్టేబుల్‌ను 108లో తరలిస్తున్న సిబ్బంది

భూపాలపల్లి అర్బన్‌: కాళేశ్వరంలో ఇద్దరు భక్తులు ఆదివారం గుండెపోటుకు గురయ్యారు. ముక్తీశ్వరస్వామి ఆలయ సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న హెడ్‌ కానిస్టేబుల్‌ పాండునాయక్‌ స్పృహతప్పి పడిపోవడంతో అక్కడే విధుల్లో ఉన్న డాక్టర్‌ రఘురామ్‌, సిబ్బంది సీపీఆర్‌ చేసి ప్రథమ చికిత్స అందించారు. అలాగే, ఏపీలోని పిఠాపురానికి చెందిన కె. వీర్రాజు వీఐపీ ఘాట్‌ వద్ద ఎండ వేడికి కళ్లు తిరిగి కింద పడిపోగా బీపీ తగ్గింది. దీంతో 108లో పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స అందించిన అనంతరం వరంగల్‌ ఎంజీఎం తరలించినట్లు వైద్యాధికారులు తెలిపారు.

ప్రముఖుల పుష్కర స్నానం..





స్వామిజీకి సరస్వతీమాత విగ్రహం బహూకరిస్తున్న అధికారులు, పుష్కర స్నానమాచరిస్తున్న హైకోర్టు జడ్జి నర్సింగరావు దంపతులు

కాటారం/కాళేశ్వరం: సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా సోమవారం పలువురు ప్రముఖులు పుష్కర స్నానం ఆచరించారు. డోర్నకల్‌ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్‌ జాటోత్‌ రాంచంద్రునాయక్‌, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌, హైకోర్టు జడ్జి నందికొండ నర్సింగరావు దంపతులు, త్రయంబకేశ్వర్‌ నాసిక్‌కు చెందిన మహామండలేశ్వర్‌ ఆచార్య సంవిధానందాసరస్వతి మహారాజ్‌ స్వామి సరస్వతి ఘాట్‌ వద్ద త్రివేణి సంఘమంలో పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం సరస్వతి మాతను దర్శించుకుని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జడ్జి దంపతులను కలెక్టర్‌ రాహుల్‌శర్మ, భూపాలపల్లి న్యాయమూర్తి అఖిల మర్యాదపూర్వకంగా కలిసి సరస్వతీమాత చిత్రపటం అందజేశారు. ఆలయ అధికారులు సంవిధానందాసరస్వతి మహారాజ్‌ స్వామికి సరస్వతీమాత విగ్రహం బహూకరించారు.

శివుడి ప్రతిమ సెట్టింగ్‌కు మంటలు



మంటలు ఆర్పుతున్న పోలీసులు

కాటారం: పుష్కరాల్లో భాగంగా సరస్వతి(వీఐపీ)ఘాట్‌ వద్ద ఏర్పాటు చేసిన శివుడి ప్రతిమ సెట్టింగ్‌కు సోమవారం మంటలు అంటుకున్నాయి. థర్మకోల్‌తో తయారు చేసిన శివుడి ప్రతిమ సెట్టింగ్‌ వద్ద భక్తులు పుష్కర స్నానం అనంతరం దీపాలు వెలిగిస్తున్నారు. ఈ క్రమంలో దీపాలు ప్రతిమ కింద గల థర్మకోల్‌ స్టాండ్‌కు అంటుకుని మంటలు చెలరేగాయి. అక్కడే డ్యూటీలో ఉన్న పోలీసులు నీళ్లతో మంటలు ఆర్పారు. భక్తులు దీపాలు వెలిగించకుండా చర్యలు చేపట్టారు.

పుష్కర విధుల్లో అతివలు..

పురుషులకు దీటుగా మహిళా ఉద్యోగుల సేవలు

- అధికంగా పోలీస్‌, వైద్యారోగ్య, శిశు సంక్షేమ శాఖలు
- భక్తిభావంతో పన్నెండు రోజుల పాటు విధుల నిర్వహణ



ప్రధాన ఆలయంలో విధులు నిర్వర్తిస్తున్న మహిళా ఎస్సై

కాటారం/మల్హర్‌ : ఒకప్పుడు వంటింటికే పరిమితమైన మహిళలు.. ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. పురుషులతో సమానంగా పోటీపడుతూ ఉద్యోగాలు సాధించి ఉన్నత స్థానంలో నిలుస్తున్నారు. ఉద్యోగాలు పొందిన అనంతరం విధి నిర్వహణలో పురుషులతో సరిసమానంగా ముందుకెళ్తున్నారు. ఎంతకష్టమైనా ఉన్నతాధికారులు కేటాయించిన విధులు సమర్థవంతంగా పూర్తి చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల్లో మహిళా ఉద్యోగులు అధిక సంఖ్యలో విధులు నిర్వర్తిస్తున్నారు. పోలీస్‌, వైద్యారోగ్య, మహిళా, శిశు సంక్షేమ శాఖల్లో పలు కేడర్లకు చెందిన మహిళా ఉద్యోగులు, సిబ్బంది పుష్కరాల్లో భక్తులకు సేవలందిస్తున్నారు.

సుమారు 300 మంది మహిళా ఉద్యోగులు..

సరస్వతీనది పుష్కరాల్లో భాగంగా పోలీస్‌, వైద్యారోగ్య, మహిళా, శిశు సంక్షేమశాఖల పరిధిలో సుమారు 300 మంది మహిళా ఉద్యోగులు విధుల్లో ఉన్నారు. ఇందులో పోలీస్‌శాఖలో సుమారు 80 మంది మహిళా ఎస్సైలు, కానిస్టేబుళ్లు, వైద్యారోగ్య శాఖలో 30 మంది మహిళా వైద్యులు, 120 మంది ఏఎన్‌ఎం, ఆశాకార్యకర్తలు, మహిళా, శిశు సంక్షేమ శాఖకు సంబంధించి సుమారు 70 మంది మహిళా ఉద్యోగులు, సిబ్బంది భక్తులకు తమ శాఖల ద్వారా సేవలు అందిస్తున్నారు. ప్రధాన ఆలయం, త్రివేణి సంఘమం, సరస్వతి పుష్కరఘాట్‌ వద్ద విధులు నిర్వర్తిస్తూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా విధుల్లో ఉన్న పలువురు మహిళా ఉద్యోగులు 'సాక్షి' పలకరించగా తమ అనుభూతులను పంచుకున్నారు.

భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉంది..



పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాల్లో భాగంగా భక్తులకు సేవ చేయడం ఆనందంగా ఉంది. ఉద్యోగ పరంగానే కాకుండా సేవ చేయాలనే ఉద్దేశంతో పుష్కర విధులకు వచ్చా. కొన్ని సందర్భాల్లో కష్టం అనిపించినా ఓర్చుకుని ముందుకెళ్తున్నా..

- లలిత, ఎస్సై

మహిళలు, చిన్నారులకు ప్రత్యేక సేవలు..



పుష్కరాల్లో భాగంగా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణులు, బాలింతలు, మహిళలు, చిన్నారులకు ప్రత్యేక సేవలందిస్తున్నాం. ప్రతీ రోజు దగ్గర ఉండి పుష్కరాలకు వచ్చే మహిళలు, చిన్నారులకు న్యూట్రీషన్‌ ఫుడ్‌ అందిస్తున్నా. రెగ్యులర్‌ డ్యూటీ అయినా ఇంత గొప్పగా కొనసాగుతున్న పుష్కరాల్లో సేవలు అందించడం సంతోషంగా ఫీల్‌ అవుతున్నా..

- మల్లీశ్వరి, జిల్లా సంక్షేమాధికారి, భూపాలపల్లి

భక్తిభావంతో పని చేస్తున్నా..



పుష్కరాల్లో భక్తి భావంతో భక్తులకు వైద్య సేవలందిస్తున్నా. పుష్కరాల్లో డ్యూటీ చేయడం కొత్త అనుభూతి ఇస్తుంది. నిత్యం అనేక మంది భక్తులు ఏదో ఒక రకమైన వైద్యం కోసం మా దగ్గరకు వస్తున్నారు. వారి ఆధ్యాత్మిక చింతన చూస్తే ఆనందం అనిపిస్తుంది.

- అఖిల, వైద్యురాలు

అదృష్టంగా భావిస్తున్నా..



పుష్కరాల్లో విధుల్లో భాగంగా భక్తులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నా. నేను మొదటి సారి పుష్కరాల విధుల్లో పాల్గొన్నా. కాళేశ్వర ఆలయ ఆవరణలో దైవసేవలో ఎలాంటి మానసిక ఒత్తిడి లేకుండా ఏకాగ్రతతో పని చేస్తున్నా. మాపై ఆ స్వామి వారి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నా.

- ప్రవళిక, కానిస్టేబుల్

పుష్కర ఏర్పాట్లు భేష్‌..

- ప్రభుత్వ విప్‌ జాటోత్‌ రాంచంద్రు నాయక్‌



ఏర్పాట్లపై కలెక్టర్‌తో మాట్లాడుతున్న విప్‌, ఎమ్మెల్యే

కాటారం: కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతీనది పుష్కరాల ఏర్పాట్లు భేష్‌గా ఉన్నాయని ప్రభుత్వ విప్‌ జాటోత్‌ రాంచంద్రు నాయక్‌ అన్నారు. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్‌తో కలిసి విప్‌ కుటుంబ సమేతంగా సోమవారం పుష్కర స్నానం ఆచరించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. పుష్కర ఏర్పాట్లు పరిశీలించి కలెక్టర్‌, అధికారులను అభినందించారు. విప్‌ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కాళేశ్వర ముక్తీశ్వరుడిని కోరుకున్నట్లు తెలిపారు.

అనుమానిస్తున్నాడని.. కడతేర్చారు

- వ్యక్తి హత్య కేసులో అత్తామామ, భార్య అరెస్ట్‌
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ తిరుపతిరావు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

మహబూబాబాద్‌ రూరల్‌ : వివాహేతర సంబంధం పెట్టుకున్న భార్యను అనుమానిస్తున్నాడని భర్తను అత్తామామ, భార్య కలిసి కడతేర్చారు. ఈ ఘటన మహబూబాబాద్‌ జిల్లా కేసముద్రం మండలం ధర్మారం తండాలో చోటుచేసుకుంది. ఈ హత్య కేసు వివరాలను మహబూబాబాద్‌ డీఎస్పీ ఎస్‌.తిరుపతిరావు సోమవారం రూరల్‌ పీఎస్‌లో వెల్లడించారు. తండాకు చెందిన బానోత్‌ వీరన్న కూతురు మౌనికను తొమ్మిది సంవత్సరాల క్రితం బల్హార్ష ప్రాంతానికి చెందిన లకావత్‌ బాలకు ఇచ్చి వివాహం జరిపించారు. వారికి ఇద్దరు కుమారులు ఉండగా, 5 సంవత్సరాల నుంచి దంపతులు హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో మౌనిక వివాహేతర సంబంధ విషయంలో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మౌనిక తన తల్లిదండ్రుల ఇంటికి వచ్చింది. ఇదే విషయమై ఈ నెల 17వ తేదీన బాల, అతడి అన్న లకావత్‌ బావుసింగ్‌ ధర్మారం తండాకు వెళ్లి మౌనికతో గొడవ పెట్టుకున్నారు. అంతలోనే భార్య మౌనిక, మామ వీరన్న, అత్త కైల కలిసి బాల, బావుసింగ్‌ కళ్లలో కారం చల్లారు. దీంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. కొద్ది సమయం తర్వాత బాల తన అత్తగారింటికి వెళ్లి తమను చంపాలని చూస్తారా అని గొడవ పెట్టుకున్నాడు. ఆ వెంటనే అతడి భార్య మౌనిక, అత్త కైల కొట్టగా మామ వీరన్న కత్తితో ఛాతీలో పొడిచాడు. తీవ్రంగా గాయపడిన బాలను 108లో మహబూబాబాద్‌ ప్రభుత్వ జనరల్‌ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా అదే రాత్రి 10 గంటలకు మృతిచెందాడు. ఈ ఘటనలో అత్తామామ వీరన్న, కైల, భార్య మౌనికను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ తెలిపారు.

కమిషనరేట్‌లో ఏసీపీల బదిలీ

వరంగల్‌ క్రైం: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన ఏసీపీ బదిలీల్లో భాగంగా వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో పలువురు ఏసీపీలు బదిలీ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 77 మంది ఏసీపీలను బదిలీ చేస్తూ డీజీపీ డాక్టర్‌ జితేందర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. నర్సంపేట ఏసీపీగా పనిచేసిన వి.కిరణ్‌కుమార్‌.. డీజీపీ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఖమ్మం సీసీఆర్‌బీ ఏసీపీగా పనిచేస్తున్న పున్నం రవీందర్‌రెడ్డి బదిలీపై వచ్చారు. తెలంగాణ సైబర్‌ సెక్యూరిటీ విభాగం డీఎస్పీగా పనిచేసిన పి.ప్రశాంత్‌రెడ్డిని కాజీపేట ఏసీపీగా, మామునూరు ఏసీపీగా పనిచేస్తున్న బి.తిరుపతి డీజీపీ కార్యాలయానికి బదిలీ కాగా, ఆయన స్థానంలో ఖమ్మం ఎస్‌బీ ఏసీపీగా పనిచేస్తున్న ఎన్‌.వెంకటేష్‌ బదిలీపై వచ్చారు. రాచకొండ 'షీ' టీమ్‌ ఏసీపీగా పనిచేస్తున్న పి.నర్సింహారావు హనుమకొండ ఏసీపీగా, హనుమకొండ ఏసీపీగా పనిచేస్తున్న కొత్త దేవేందర్‌ రెడ్డి డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. సీఐడీ డీఎస్పీగా పనిచేస్తున్న పి.సదయ్య వరంగల్‌ సీసీఎస్‌ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఇప్పటికే బదిలీ అయిన స్థానాల్లో పలువురు ఏసీపీలు రిపోర్టు చేశారు. నర్సంపేట ఏసీపీగా పనిచేసిన కిరణ్‌కుమార్‌ సీసీఎస్‌ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. పి.ప్రశాంత్‌రెడ్డి కాజీపేట ఏసీపీగా, నర్సంపేట ఏసీపీగా పున్నం రవీందర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కొత్తగా వెలువడిన ఉత్తర్వుల్లో సీసీఎస్‌ ఏసీపీగా పి.సదయ్య బదిలీ అయినట్లు ఉండడం గందరగోళానికి తావిస్తోంది. ఒకటి, రెండు రోజుల్లో బదిలీ ఉత్తర్వులపై స్పష్టత వచ్చే అవకాశం ఉన్నట్లు ఓ పోలీస్‌ ఉన్నతాధికారి తెలిపారు.

ఏఐవైఎఫ్‌ జాతీయ కార్యదర్శిగా వలీఉల్లాఖాద్రీ



కేయూ క్యాంపస్‌: అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్‌) జాతీయ కార్యదర్శిగా వరంగల్‌కు చెందిన డాక్టర్‌ వలీ ఉల్లాఖాద్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఏపీలోని తిరుపతిలో నాలుగురోజులుగా నిర్వహించిన ఏఐవైఎఫ్‌ జాతీయ మహాసభల్లో వలీఉల్లాఖాద్రీని జాతీయ కార్యదర్శిగా ఎన్నుకున్నారు. వలీఉల్లాఖాద్రీ తెలంగాణ మలిదశ ఉద్యమంలో కీలక పాత్రపోషించారు. కేయూ వేదికగా అనేక ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. ఏఐఎస్‌ఎఫ్‌ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేశారు. ఆ తర్వాత ఏఐఎస్‌ఎఫ్‌ జాతీయ అధ్యక్షుడిగా కూడా దేశం వ్యాప్త విద్యార్థి ఉద్యమాల్లో భాగస్వాములయ్యారు. వలీఉల్లాఖాద్రీ కేయూలో కామర్స్‌ అండ్‌ బిజినెస్‌మేనేజ్‌మెంట్‌ విభాగం నుంచి డాక్టరేట్‌ పొందారు.

త్రివేణి సంగమం.. భక్తజన సంద్రం

- సరస్వతీ నది పుష్కరాలకు పోటెత్తిన భక్తజనం
- ఐదో రోజు 80వేల మంది పుణ్యస్నానాలు



పుష్కర ఘాట్‌ వద్ద పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

భూపాలపల్లి/కాళేశ్వరం: సరస్వతీ నది పుష్కరాలకు సోమవారం ఐదోరోజు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించి నదీమాతకు పూజలు చేశారు. చీరె, సారె సమర్పించారు. ముత్తయిదువలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. పిండ ప్రదానాలు, పితృదేవతలకు తర్పణాలు నిర్వహించారు. భక్తులతో పుష్కరిణి నిండిపోయింది. పుష్కర స్నానాలు ఆచరించిన అనంతరం భక్తులు కాళేశ్వర ముక్తీశ్వరస్వామిని దర్శించుకున్నారు.

తగ్గిన రద్దీ

పుష్కరాలకు భక్తుల రద్దీ తగ్గింది. హైదరాబాద్‌, వరంగల్‌, భూపాలపల్లి.. మంథని, కాటారం మీదుగా.. అలాగే మంచిర్యాల, గోదావరిఖని, చెన్నూర్‌, ఆసిఫాబాద్‌, నిర్మల్‌ నుంచి భక్తులు వాహనాల్లో తరలివచ్చారు. ట్రాఫిక్‌ జామ్‌ కాకుండా పోలీసులు డివైడర్లు ఏర్పాటు చేసి నియంత్రించారు. పార్కింగ్‌ స్థలాల్లో వాహనాల రద్దీ కొనసాగింది. శని, ఆదివారాల్లో రెండేసి లక్షల చొప్పున భక్తులు రాగా.. సోమవారం 80వేల మంది పుణ్యస్నానాలు ఆచరించినట్లు అధికారులు అంచనా వేశారు.

నదీహారతికి రద్దీ

సరస్వతీ ఘాట్‌లో కాశీపండితులచే ఏర్పాటు చేసిన నవరత్నమాలిక హారతికి భక్తుల తాకిడి పెరుగుతోంది. ఏడు గద్దెలపై తొమ్మిది హారతులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విద్యుత్‌ వెలుగుల్లో హారతి ఇస్తున్నారు. తిలకించేందుకు భక్తులు పోటీ పడ్డారు. సరస్వతీ అమ్మవారి విగ్రహం వద్ద భక్తులు దర్శించుకున్నాక జ్ఞానతీర్థం వద్ద ఫొటోలు, సెల్ఫీలు దిగారు.

నాసిక్‌ పీఠాధిపతి పూజలు

నాసిక్‌ త్రయంబకేశ్వర్‌ మహామండలేశ్వర్‌ ఆచార్య సంవిధానందా సరస్వతీ మహారాజ్‌ ముందుగా త్రివేణి సంగమంలోని అంతర్వాహిని సరస్వతీనదిలో పుష్కర స్నానం.. విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రాజగోపురం వద్ద అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకుని పూజలు చేశారు.

త్వరలో జిల్లాకు క్రికెట్‌ స్టేడియం

- ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య
- అంతర్‌ జిల్లాల క్రికెట్‌ పోటీలు షురూ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్సీ

వరంగల్‌ స్పోర్ట్స్‌: జిల్లాలో క్రికెట్‌ స్టేడియం నిర్మాణ అంశాన్ని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి ఉమ్మడి వరంగల్‌ జిల్లా ఎమ్మెల్యేలు తీసుకెళ్లారని, త్వరలోనే స్టేడియం ఏర్పాటు ప్రకటన వెలువడనుందని ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య అన్నారు. వరంగల్‌ క్రికెట్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో హనుమకొండ రెడ్డిపురంలో సోమవారం అంతర్‌జిల్లాల క్రికెట్‌ లీగ్‌ పోటీలు ప్రారంభమయ్యాయి. హనుమకొండ, భూపాలపల్లి జిల్లాల మధ్య జరిగిన మ్యాచ్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పటి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి హయాంలో బీజంపడిన క్రికెట్‌ స్టేడియం నిర్మాణం.. ఇప్పుడు ఆచరణలోకి రానుందని, అందుకు ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలతో పాటు తానుకూడా ముందుండి నిర్మాణం జరిగేలా చొరవచూపుతానని భరోసా కల్పించారు. క్రికెట్‌ అసోసియేషన్‌ జిల్లా కార్యదర్శి చాగంటి శ్రీనివాస్‌ మాట్లాడుతూ రెడ్డిపురంతో పాటు మొగిలిచర్ల గ్రౌండ్‌లో జనగామ, ములుగు, వంగాలపల్లి మైదానంలో వరంగల్‌, మహబూబాబాద్‌ జట్ల మధ్య లీగ్‌ మ్యాచ్‌లు కొనసాగాయని తెలిపారు. సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్‌గౌడ్‌, ఉపాధ్యక్షుడు సదాశివ్‌, తోట రాము, సంయుక్త కార్యదర్శి ఉపేందర్‌ పాల్గొన్నారు.